సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ׀ 6 ׀ ఫిబ్రవరి ׀ 2024



సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

ఈనెల 11న రాప్తాడు సమీపంలోని ఆటోనగర్‌లో సిద్ధం సభ నిర్వహించనున్నారు. సీఎం జగన్ రానుండగా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.8°/14.3°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

పుట్టపర్తి అర్బన్: నులిపురుగులు నిర్మూలిస్తేనే చిన్నారుల ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డీపీఎం కుళ్లాయప్ప నాయక్, డాక్టర్ నివేదిత తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడుపులో నులిపురుగుల కారణంగా పిల్లల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. వీటి నివారణకు ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,74,171 మంది చిన్నారులు ఉన్నారని, వారందరికీ ఈ మాత్రలు అందించాలన్నారు. అలాగే ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పిల్లలకు మాత్రలు ఇవ్వాలన్నారు. జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఈనెల 9న మాత్రలు వేసుకోనివారికి 16వ తేదీన మాత్రలు అందిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాతే మాత్ర వేసుకోవాలని సూచించారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ




కొత్తచెరువులో వృద్ధుడికి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న కప్పలబండ వలంటీర్ రాధమ్మ

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ కింద అందించే 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో ముగిసింది. జిల్లాలో 2,74,578 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ఐదు రోజుల్లో 2,72,347 మందికి (99 శాతం) పింఛన్ మొత్తం అందజేశారు. తొలిరోజు తెల్లవారుజామునే ఇంటింటికీ తిరిగి పింఛన్ మొత్తం అందజేసిన వలంటీర్లు... రెండో రోజు నుంచి సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకే వెళ్లి 'కానుక' మొత్తం అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

మెరిట్ లిస్టు విడుదల

అనంతపురం మెడికల్: జిల్లా క్షయ వ్యాధి నివారణ విభాగంలో వివిధ పోస్టులకు భర్తీకి సంబంధించి అభ్యర్థుల మెరిట్ లిస్టును అనంతపురం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. మెడికల్ ఆఫీసర్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్, టీబీ, హెచ్‌ఐవీ సూపర్‌వైజర్, జిల్లా పీపీఎం కో ఆర్డినేటర్, అకౌంటెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 7న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

ఏపీ ఈసెట్ కార్యాలయం ప్రారంభం



ఈసెట్ కార్యాలయంలో చైర్మన్ జీవీఆర్ శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) నూతన పాలక భవనంలో ఏపీ ఈసెట్ - 2024 కార్యాలయాన్ని సోమవారం ఏపీ ఈసెట్ రాష్ట్ర చైర్మన్/ జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జీవీఆర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఏపీ ఈసెట్ బాధ్యతను జేఎన్‌టీయూఏకు అప్పగించారు. ఇది వరకు ఏడు దఫాలు ఈసెట్‌ను జేఎన్‌టీయూ నిర్వహించింది. తాజాగా ఎనిమిదో దఫా జేఎన్‌టీయూ(ఏ) నిర్వహిస్తోంది. ఇందులో ఆరు దఫాలు ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి ఈసెట్ కన్వీనర్‌గా ఉన్నారు. తాజాగా ఏడో దఫా కూడా రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కింది. ఈసెట్ రాష్ట్ర కన్వీనర్ భానుమూర్తి నూతన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆమెకు ఆర్థిక చేయూత

- మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్న 'వైఎస్సార్ చేయూత'
- 45 నుంచి 60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి
- ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు
- 16న నాల్గో విడత నిధులు విడుదల చేయనున్న ప్రభుత్వం
- జాబితా సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం

సాక్షి, పుట్టపర్తి

ఇద్దరు, ముగ్గురు పిల్లలు. వృద్ధులైన అత్తామామలు, భర్త రెక్కల కష్టంపైనే కుటుంబమంతా ఆధారపడాల్సిన పరిస్థితి. పిల్లలను ఉన్నత చదువులకు పంపాలన్నా ఇబ్బందులే. ఏదైనా చిరు వ్యాపారం చేసి కుటుంబానికి చేదోడుగా నిలవాలన్నా పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితి. గతంలో ఎంతోమంది మహిళల పరిస్థితి ఇది. కానీ రాష్ట్రంలో జగన్ సర్కార్ కొలువుదీరాక మహిళల జీవితాల్లో వెలుగులు నిండాయి. 'వైఎస్సార్ చేయూత' ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పేదింటి మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున అందిస్తున్నారు. దీంతో వారు ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాలకు చేయూతనిచ్చారు. ఇప్పటికే మూడేళ్లుగా ఏడాదికి రూ.18,750 చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. తాజాగా ఈనెల 16వ తేదీన నాల్గో విడత నిధులు జమ చేయనున్నారు. నాల్గో విడత జాబితా కూడా సిద్ధం చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలియజేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద జిల్లాకు నాలుగు విడతల్లో కలిపి మొత్తం 1,22,826 మంది మహిళలకు రూ.810.91 కోట్ల లబ్ధి చేకూరింది.



ఈమె పేరు కళావతి. తనకల్లులో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. ప్రభుత్వం ఈమెకు 'వైఎస్సార్ చేయూత' ద్వారా ఏటా రూ.18,750 ఇస్తోంది. అలాగే స్త్రీ నిధి ద్వారా రూ.50 వేల బ్యాంకు రుణం కూడా అందించింది. దీంతో కళావతి వ్యాపారం వృద్ధి చేసుకుంటూ కుటుంబానికి చేయూతనిచ్చింది. ఏళ్లుగా కష్టాలు పడ్డామని, జగనన్న సీఎం అయిన తర్వాత ఇంటి పట్టున వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివించగలుగుతున్నామని ఆనందం వ్యక్తం చేసింది.



ఈ చిత్రంలోని మహిళ పేరు శశికళ. చిలమత్తూరు మండలం కొడికొండ. గతంలో టైలరింగ్ పని చేసేది. వైఎస్ జగన్ సర్కార్ ఏర్పడ్డాక 'వైఎస్సార్ చేయూత' పథకం ద్వారా లబ్ధి చేకూరడంతో ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంది. రోజూ సగటున రూ.600 ఆదాయం ఆర్జిస్తున్నానని, చేయూత కింద ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.56,250 లబ్ధి చేకూరినట్లు సంతోషంగా చెబుతోంది.



ఈమె పేరు వెంకట లక్ష్మమ్మ. గుడిబండ మండలం రాళ్లపల్లి పంచాయతీ మైనగానిపల్లి గ్రామం. వైఎస్సార్ ఆసరాతో పాటు గత రెండేళ్ల నుంచి వైఎస్సార్ చేయూతకు అర్హత సాధించడంతో ఇప్పటి వరకు రూ.37,500 లబ్ధి కలిగింది. దాంతో పాటు బ్యాంకులో రుణం తీసుకుని ఫ్లోర్‌మిల్ నిర్వహిస్తోంది. ఏటా సగటున రూ.1.5 లక్షల ఆదాయం సంపాదిస్తున్నానని చెబుతోంది. తనలాంటి ఎందరికో ఆర్థిక చేయూతనిచ్చి ఆదుకుంటున్న వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలని చెబుతోంది.

వైఎస్సార్ చేయూత ద్వారా జిల్లాకు చేకూరిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
2020 - 21	1,05,311	197.46
2021 - 22	93,161	174.67
2022 - 23	1,11,189	208.48
2023 - 24	1,22,826	230.30



రుణపడి ఉంటాం



గత ప్రభుత్వంలో కూలి పనులకు వెళ్లి జీవనం సాగించే వాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'వైఎస్సార్ చేయూత' పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. సున్నా వడ్డీ పథకం, ఆసరా ద్వారా మరింత సొమ్ము తీసుకుని కిరాణా షాపు నిర్వహిస్తున్నా. గతంలో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డా. ఇప్పుడా కష్టాలు లేవు. ఆర్థికంగా చేయూతనిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – ఫరీదా, రామగిరి

జగన్ మేలు మరువలేం



వైఎస్సార్ చేయూత ద్వారా ఇప్పటికే మూడు విడతల్లో లబ్ధి పొందాను. అదేవిధంగా స్త్రీ నిధి ద్వారా బ్యాంకు రుణాలు ఇచ్చారు. కిరాణా షాపు నిర్వహిస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నా. రోజుకు సగటున రూ.వెయ్యి ఆదాయం వస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలోనే మహిళలకు న్యాయం జరుగుతోంది. సీఎం జగన్ మేలు మరువలేం. – ఎం.రాజీ, నిడిగల్లు, తాడిమర్రి మండలం

అర్హులందరికీ లబ్ధి



ఈసారి అర్హుల జాబితా పెరిగింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ 'చేయూత' పథకాన్ని వర్తింపజేశాం. ఈనెల 16న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 11,637 మంది అర్హత సాధించారు. నాల్గో విడత జాబితా సిద్ధం చేశాం.
– కేఎస్ నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ, శ్రీసత్యసాయి జిల్లా

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- కులగణన సర్వే పూర్తి కావాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'స్పందన'లో అందే ప్రతి అర్జీకి మెరుగైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 278 అర్జీలను అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. అర్జీల పరిష్కారం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్నారు. గడువులోపు సమస్య పరిష్కరిస్తే అర్జీదారుడు కూడా సంతృప్తి చెందుతాడన్నారు.

90 శాతం కులగణన సర్వే పూర్తి..

జిల్లాలో కులగణన సర్వే 90 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 10 శాతం కుటుంబాల వివరాలనూ త్వరగా సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. కులగణన సర్వేపై మండల స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సర్వేతో పాటు ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కులగణన సర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను గుర్తించి నివేదికలను ఈనెల 9వ తేదీలోపు కలెక్టరేట్‌కు పంపాలన్నారు. 9వ తేదీన ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణన్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలా జ్యోతి, సీపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చేనేతలకు ఆపన్నహస్తం





బాధిత చేనేత కుటుంబాలకు పరిహారం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలకు ప్రభుత్వ సాయం
- 15 కుటుంబాలకు రూ.75 లక్షలు అందించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి
- పిల్లల చదువులకు సాయం అందిస్తామని హామీ

ధర్మవరం: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు వైఎస్ జగన్ సర్కార్ ఆపన్న హస్తం అందించింది. ఆర్థిక చేయూతనిచ్చి ఆదుకుంది. ధర్మవరం పట్టణంలోని 15 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాల పరిస్థితిని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన జగన్ సర్కార్ ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.75 లక్షలు మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి సోమవారం బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి పరిహారానికి సంబంధించిన చెక్కులు అందించారు.

టీడీపీ హయాంలో మృత్యువాత పడిన వారికీ సాయం చేశాం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేనేత రంగం క్రమంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి అన్నారు. 'నేతన్న నేస్తం' ద్వారా అర్హులైన చేనేతలకు ఏటా రూ.24 వేలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అమలు చేసిన చేనేత వ్యతిరేక విధానాల వల్ల సంక్షోభంతో కార్మికులు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 మందికిపైగా చేనేత కార్మికులు చనిపోతే చంద్రబాబు పైసా సాయం అందించలేదన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోపే 50 మంది చేనేత కార్మికులకు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు జింకా కంబగిరి, బడిమెల మూర్తి, కౌన్సిలర్లు, నాయకులు కాచర్ల అంజి, తరుణికంటి రమేష్, షేక్ చాంద్‌బాషా, చిల్లా భాస్కర్‌రెడ్డి, బడన్నపల్లి కేశవరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జేసీబీ రమణ, గోరకాటి పురుషోత్తంరెడ్డి, తోపుదుర్తి వెంకటరాముడు, ఎస్పీ బాషా, కడప రంగస్వామి, బాలం గోపాల్, చింతా యల్లయ్య, సరితాల బాషా, కోటిరెడ్డి బాలిరెడ్డి, కత్తె పెద్దన్న, శంకర యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందుకున్న బాధిత కుటుంబాలు ఇవే..

శాంతినగర్‌కు చెందిన గుడిపాటి ఆనంద్, రాజేంద్రనగర్‌కు చెందిన వీరాంజనేయులు, సత్యసాయినగర్‌కు చెందిన నారాయణస్వామి, కేతిరెడ్డి కాలనీకి చెందిన ఈశ్వరయ్య, వెంకటరాముడు, శివానగర్‌కు చెందిన పుట్లూరు మురళీ, శాంతినగర్‌కు చెందిన మాదన లక్ష్మి, రామ్‌నగర్‌కు చెందిన చింతా జగదీష్, చంద్రబాబు నగర్‌కు చెందిన లక్ష్మీకాంత్, సిద్ధయ్యగుట్టకు చెందిన జింకా హరీష్, శారదానగర్‌కు చెందిన సాకే గంగాధర్, పార్థసారథినగర్‌కు చెందిన దామోదర్, రామ్‌నగర్‌కు చెందిన పూజారి రాములు కుటుంబాలకు జగన్ సర్కార్ రూ.5 లక్షల చొప్పున సాయం అందించింది.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

కుటుంబ యజమానిని కోల్పోయిన చేనేత కుటుంబాల వారు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, జగనన్న ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి భరోసా ఇచ్చారు. ఏ కష్టం ఉన్నా...ఏ సమయంలోనైనా తాను అందుబాటులో ఉంటానన్నారు. బాధిత చేనేత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి.. ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాల పిల్లల చదువు బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. చదువుకు సంబంధించి ఏ సాయం కావాలన్నా నేరుగా తన ఇంటి వద్దకు రావాలని సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ పిల్లలను పెద్ద చదువులు చదివించాలని సూచించారు.

పారిశ్రామిక ప్రగతి

పారిశ్రామిక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు అందించి పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు విస్తృతంగా ఏర్పాటయ్యాయి. కోవిడ్ కష్టకాలంలో మూతపడిన పరిశ్రమలకు సైతం ఆర్థిక చేయూతనందించి అండగా నిలిచింది.

- ఉమ్మడి జిల్లాలో వెల్లువలా యూనిట్లు
- నాలుగేళ్లలో 900 పరిశ్రమల ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి
- ఉపాధి అవకాశాలతో జీవన ప్రమాణాలు మెరుగు



పుట్లూరులో ఏర్పాటు చేసిన నేహా ఇండస్ట్రీస్

అనంతపురం టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తొలినాళ్ల నుంచి పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనువైన జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారు. అందులో భాగంగానే ఉమ్మడి అనంతపురం జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి పెద్ద పీట వేశారు. 2019-23 మధ్య కాలంలో రూ.409 కోట్ల పెట్టుబడులతో 900 పైగా పరిశ్రమలు నెలకొల్పారు. ప్రత్యక్షంగా 12,500మందికి పైగా యువత స్థానికంగానే ఉపాధి పొందుతోంది. పరోక్షంగా 25వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. వీటితోపాటు సేవా రంగంలో 2వేలకు పైగా యూనిట్లను మంజూరు చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం కప్పలబండ, హిందూపురం మండలం కొటిపి, ఆర్.అనంతపురం గ్రామాల్లో నాలుగు ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్కులు ఏర్పాటు చేశారు. ఇందులో యూనిట్లు స్థాపించాలనుకునే వారికి రాయితీతో స్థలాలు కేటాయిస్తున్నారు.

రూ.12 లక్షల రాయితీ వచ్చింది



డ్రిప్ తయారీ పరిశ్రమ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు మంజూరు చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షల పెట్టుబడితో నిర్మాణ పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం డ్రిప్ పరికరాలను తయారు చేస్తున్నాం. ఇటీవలే పరిశ్రమల శాఖ అధికారుల సిఫార్సుతో ప్రభుత్వం నుంచి రూ.12 లక్షల రాయితీ మంజూరైంది.
– కుళ్లాయప్ప, నేహా ఇండస్ట్రీస్, పుట్లూరు

పారిశ్రామిక పాలసీ బాగుంది



కర్ణాటకతో పోలిస్తే ఏపీలో పారిశ్రామిక పాలసీ బాగుంది. నేను ఇండస్ట్రియల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసిన వెంటనే పరిశ్రమల శాఖ అధికారులు సంప్రదించారు. రాయితీలు, ప్రోత్సాహకాల గురించి తెలిపారు. పెనుకొండ సమీపంలో పరిశ్రమ ఏర్పాటు కోసం స్థలం కేటాయించారు. వెంటనే ఇంటి ఉపకరణాల పరిశ్రమ ఏర్పాటు చేశాను.
– డాక్టర్ నాగేంద్ర, పారిశ్రామికవేత్త, బెంగళూరు

పారిశ్రామికవేత్తలకు సహకారం



యువ పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు అందిస్తాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలను మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి చేస్తోంది. పరిశ్రమల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థలాలు కేటాయిస్తున్నాం.
– నాగరాజరావు, పరిశ్రమల శాఖ, జీఎం

పోలీస్ 'స్పందన'కు 37 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రశాంతి నిలయం: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి మొత్తం 37 అర్జీలు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి ప్రతి అర్జీదారునితో ఓపికతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

సమర్థంగా పనిచేయండి..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై జిల్లాకు వచ్చిన అధికారులు సమర్థవంతంగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెంచాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. తిరుపతి, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి పలువురు సీఐ, ఎస్‌ఐలు జిల్లాకు బదిలీపై వచ్చారు. వీరంతా సోమవారం మధ్యాహ్నం ఎస్పీ మాధవరెడ్డిని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐలు ఈరన్న (హిందూపురం వన్ టౌన్), మనోహర్ (మడకశిర అప్‌గ్రేడ్), ఎస్‌ఐలు సురేశ్‌బాబు (బుక్కపట్నం), వీరేశ్ (అగళి) ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. విధులు బాగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతి



సీఈఓ ప్రవీణ్‌ప్రకాష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి

పుట్టపర్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌కు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ ఏపీ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి తదితరులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో సీఈఓ ప్రవీణ్ ప్రకాష్‌ను వారు కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు అశోక్ కుమార్‌రెడ్డి, రమణారెడ్డి తెలిపారు.

26 నుంచి రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఈ నెల 26 నుంచి అనంతపురం వేదికగా రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 3వ తేదీ వరకూ అనంత క్రీడా గ్రామం వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనేందుకు ఆసక్తి గల జర్నలిస్టులు అనంతపురంలోని తన కార్యాలయంలో వివరాలు అందజేయాలని కోరారు.

కొలువుల జాతర

పశు సంవర్ధక శాఖలో కొలువుల జాతర జరుగుతోంది. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా పశు సంవర్ధక శాఖ పరిధిలో మిగిలిపోయిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు నెల రోజులుగా పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా కొనసాగిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం నియామకాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజుల్లో నియామక పత్రాలు, ప్లేస్‌మెంట్లు ఇవ్వనున్నారు.

- పశుసంవర్ధక శాఖలో 442 వీఏహెచ్‌ఏ పోస్టుల భర్తీ
- రెండు విడతల్లో సాఫీగా ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటామంటున్న వీఏహెచ్‌ఏలు



అనంతపురం అగ్రికల్చర్: రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) వేదికగా పశు వైద్యం, పశు సంవర్ధక శాఖ తరఫున ప్రభుత్వ పథకాలు అమలు చేసి పాడి రైతులు, జీవాల కాపర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పశు సంవర్ధక సహాయకుల (వీఏహెచ్‌ఏ)ను నియమిస్తోంది. రాష్ట్రంలో ఏ జిల్లాకూ లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు 692 పోస్టులు కేటాయించారు. సచివాలయ వ్యవస్థ ప్రక్రియలో భాగంగా మూడేళ్ల కిందట మొదటి విడతగా 219 మంది వీఏహెచ్‌ఏలను నియమించారు. సంబంధిత కోర్సులు, విద్యార్హత లేని కారణంగా 473 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి.

- రెండేళ్ల తర్వాత ఈ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రెండేళ్ల కాలంలో సంబంధిత కోర్సు చేసిన 926 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత డిసెంబర్ 31న ఏడు కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో 150 మార్కులకు పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 919 మంది హాజరయ్యారు. రోస్టర్, మెరిట్ ఆధారంగా డైరెక్టరేట్ పరిధిలో మొదటి విడతగా 206 మంది అభ్యర్థులు, రెండో విడతగా 240 మంది అభ్యర్థులను అర్హులుగా ప్రకటించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్హత పొందిన 446 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను నాలుగు నుంచి ఆరు బృందాలు మూడు రోజుల పాటు నిశితంగా పరిశీలించి 442 పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేశారు.
- ఎంతోకాలంలో ఎదురుచూస్తున్న వీఏహెచ్‌ఏ కొలువులు భర్తీ చేపట్టడంతో నిరుద్యోగ యువతతో పాటు గత 15 సంవత్సరాలు పశు సంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న గోపాలమిత్రలు కూడా హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. గోపాలమిత్రలకు అదనంగా 15 మార్కులు కలపడంతో 70 మందికి పైగా గోపాలమిత్రలు ఇపుడు వీఏహెచ్‌ఏలుగా నియమితలవుతున్నారు. కొత్తగా పోస్టులు పొందిన వారిలో ఎస్సీ, ఎస్టీలు 90 మంది, బీసీలు 140 మంది ఉన్నారు. ఇందులో సగం మంది వరకు మహిళా అభ్యర్థులు ఉండటం విశేషం.

ఆనందంగా ఉంది



ప్రభుత్వం, డైరెక్టరేట్, కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా పాటించి అత్యంత పారదర్శకంగా వీఏహెచ్‌ఏల నియామక ప్రక్రియ చేపట్టాం. ఒకేసారి 442 మంది పశుశాఖ తరఫున ఉద్యోగాలు పొందారు. చాలా ఆనందంగా ఉంది. ఇక నుంచి పశు సంవర్ధక శాఖ తరఫున పాడి రైతులు, జీవాల కాపర్లకు మున్ముందు మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం.

– డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్, ఉమ్మడి అనంతపురం జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీలు

సీఎంకు రుణపడి ఉంటాం



ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అంటే ఇపుడున్న పరిస్థితుల్లో చాలా కష్టమైన పని. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఆయనకు రుణపడి ఉంటాం. డిగ్రీ పూర్తి చేయడంతో పాటు వీఏహెచ్‌ఏ పోస్టుకు రెండేళ్ల వెటర్నరీ కోర్సు చేశాను. అమ్మా, నాన్న కూలి పనులు చేస్తూ చదివించారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. – విశ్వనాథ్, తాడిపత్రి

ప్రభుత్వానికి మంచి పేరు తెస్తాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యువత తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఒకే విడతలో ఇంతమందిని ప్రభుత్వ ఉద్యోగాల్లోకి తీసుకోవడం శుభపరిణామం. డిగ్రీ, పీజీలు పూర్తి చేసి ఉద్యోగాల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న మాలాంటి యువతకు పశు శాఖలో కొలువులు కల్పిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. రాయదుర్గంలో వలంటీరుగా పనిచేస్తున్న నేను వీఏహెచ్‌ఏ పోస్టుకు ఎంపికవడం సంతోషంగా ఉంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పని చేస్తా. – హెచ్.మంజుల, టి.వీరాపురం, రాయదుర్గం మండలం

జనవాక్కు

పిల్లల చదువుల బెంగ తీరింది



నాకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్న నాకు వారి చదువులు ఎలా అనే దిగాలు ఉండేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న బాధ్యతలు తీసుకున్న తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్నా. జగనన్న దీవెన పథకాలు అందడంతో నా పిల్లల చదువుకు ఢోకా లేకుండా పోయింది. నా కుమారుడు ప్రస్తుతం బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. మహిళా సంఘంలో నాకున్న రుణం మాఫీ అయింది. రుణమాఫీ డబ్బుతో నా దుకాణాన్ని మరింత అభివృద్ధి చేసుకున్నా. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. మాకెంతో మేలు చేసిన జగనన్నను మరోసారి గెలిపించుకుంటాం.

– జయలక్ష్మి, పట్నం, కదిరి మండలం

అన్ని విధాలుగా ఆదుకున్నారు



అనారోగ్యంతో నా భర్త చనిపోయారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకూ ప్రమాదంలో మృతిచెందాడు. గత ప్రభుత్వంలో వితంతు పింఛన్‌కు లెక్కకు మించి దరఖాస్తులు అందజేశాను. అయినా మంజూరు కాలేదు. ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాను. ఫలితం దక్కలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత నా కష్టాలు తీరాయి. వలంటీరే మా ఇంటి వద్దకు వచ్చి నాకు పింఛన్ వచ్చేలా చేశాడు. ముసలి వయస్సులో ఎవరూ పట్టించుకోకపోయినా నేనున్నాని సీఎం జగన్ నన్ను అన్ని విధాలుగా ఆదుకున్నాడు. నా ప్రాణం ఉన్నంత వరకూ నేను జగన్‌కే మద్దతు ఇస్తా.

– నంజమ్మ, ఫశారం, గుడిబండ మండలం

రూ.2 లక్షలకు పైగా లబ్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ.2,02,132ల లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి చేకూర్చారు. ఇలాంటి ముఖ్యమంత్రి మరో పదికాలాల పాటు అధికారంలో ఉంటే రాష్ట్రంలో పేదరికం పూర్తిగా మటుమాయమవుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. అందుకే మేమంతా వైఎస్ జగన్‌కు అండగా ఉంటాం.

– సంజీవరెడ్డి, ఎస్.హొసళ్లి, గుమ్మఘట్ట మండలం

సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

- 11న రాప్తాడులో 'సిద్ధం' సభ



ఏర్పాట్లపై డీఎస్పీలు, నాయకులతో చర్చిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న రాప్తాడు మండల కేంద్రంలోని ఆటో నగర్ సమీపాన రాయలసీమ స్థాయిలో 'సిద్ధం' బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభ ఏర్పాట్లను సోమవారం సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్/ ఎమ్మెల్సీ తలశిల రఘురాం పరిశీలించారు. నేల చదును, టెంట్లు, సభాస్థలి ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు.

డీఎస్పీలతో సమీక్ష : బహిరంగ సభాస్థలి వద్ద అనంతపురం, రూరల్ డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, వెంకటశివారెడ్డితో కో ఆర్డినేటర్ తలశిల రఘురాం సమీక్షించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సభాస్థలి, హెలిప్యాడ్, ట్రాఫిక్ ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయయాదవ్, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెదదూరి గోపాల్‌రెడ్డి, అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, గోవిందరెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకులు చిత్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

110 సెల్‌ఫోన్ల అందజేత

ప్రశాంతి నిలయం: వివిధ సందర్భాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు చాట్‌బాట్ సేవల ద్వారా చేసిన ఫిర్యాదుపై జిల్లా పోలీసులు స్పందించారు. రూ.22 లక్షలు విలువ చేసే 110 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సంబంధీకులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాధితులకు సెల్‌ఫోన్లను ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అందజేసి, మాట్లాడారు. ఆధునిక సాంకేతికత చాలా బలంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో ఫోన్ దొరికిన వాళ్లు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు అప్పజెప్పి నిజాయితీ నిరూపించుకోవాలని కోరారు. లేకుంటే పోలీసు చర్యలకు గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకూ చాట్‌బాట్ సేవల ద్వారా రూ.70 లక్షలు విలువ చేసే 348 స్మార్ట్‌ఫోన్లు రికవరీ చేసి, సంబంధీకులకు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్.విష్ణు, టెక్నికల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

యువతి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: ప్రేమించిన యువకుడిని కాదని మరొకరితో పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించడంతో మనస్తాపం చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం పెద్ద ఎక్కలూరు గ్రామానికి చెందిన పుల్లయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె గంటల రాజేశ్వరి (19) గతంలో ఇంటి నుంచి పారిపోయి బెంగళూరుకు చెందిన ఓ యువకుడిని పెళ్లి చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బెంగళూరులో ఉన్న రాజేశ్వరిని గుర్తించి పిలుచుకొచ్చి మైనర్ కావడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ఇటీవల మరో యువకుడితో పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

హిందూపురం అర్బన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.సడ్లపల్లికి చెందిన ప్రవీణ్ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. కడుపునొప్పి తాళలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తండ్రి హనుమంతప్ప ఫిర్యాదు చేశారు. ఘటనపై హిందూపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను కలెక్టర్ అరుణ్ బాబు సోమవారం పంపిణీ చేశారు. గాండ్లపెంటకు చెందిన భాస్కర్‌రెడ్డి, శ్రీదేవికి రూ.15 వేలు విలువ చేసే వినికిడి యంత్రాలతో పాటు పలువురు దివ్యాంగులకు చేతి కర్రలు, చంక కర్రలు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారులు రమణప్ప, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య కుట్ర భగ్నం

- నిందితుడి అరెస్ట్
- మారణాయుధం స్వాధీనం

తాడిపత్రి: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హతమార్చేందుకు పన్నిన కుట్రను తాడిపత్రి రూరల్ పోలీసులు భగ్నం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, మారణాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీఎం గంగయ్య వెల్లడించారు.

ఫేస్‌బుక్‌లో పరిచయం..

ఉరవకొండకు చెందిన నాగరాజు, సౌభాగ్య దంపతులు. 12 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మూడేళ్ల క్రితం సౌభాగ్యకు ఫేస్‌బుక్ ద్వారా గుంతకల్లు మండలం నక్కనదొడ్డికి చెందిన గోపాల్‌భాస్కర్‌తో పరిచయమైంది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం భర్తకు తెలియకుండా జాగ్రత్త పడిన సౌభాగ్య... ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న తాడిపత్రికి చేరుకుంటే జీవనం సాఫీగా సాగుతుందని నమ్మబలికింది. దీంతో కొన్ని నెలల క్రితం తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో అద్దె ఇంటికి నాగరాజు మకాం మార్చాడు. ఈ క్రమంలో తరచూ తన ప్రియుడితో ఆమె కలుస్తూ వచ్చింది.

విషయం బట్టబయలై...

తాను పని కోసం బయటకు వెళ్లిన సమయంలో మరో వ్యక్తితో తన భార్య సన్నిహితంగా ఉంటోందన్న విషయం నాగరాజు తెలిసింది. దీంతో నిఘా ఉంచిన నాగరాజు తన భార్య సాగిస్తున్న వివాహేతర సంబంధం గుర్తించి నిలదీశాడు. పద్ధతి మార్చుకోవాలని హితవు పలికాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాల్‌భాస్కర్ ఎలాగైనా నాగరాజు అడ్డు తొలగించుకోవాలని సౌభాగ్యకు తెలియకుండా పథకం వేశాడు. ఈ నేపథ్యంలోనే పలువురితో కిరాయి చెల్లించేందుకు మంతనాలు జరిపాడు. అయినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తానే స్వయంగా రంగంలో దిగి నాగరాజును అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు.



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి..

రోజూ ఉదయం నాగరాజు తాడిపత్రిలోని సాయిలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్దకు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలుసుకున్న గోపాల్‌భాస్కర్ ఎలాగైనా ఆ మార్గంలోనే తన పథకాన్ని అమలు చేయాలని భావించాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వేట కొడవలితో నాగరాజును హత్య చేసేందుకు అపార్ట్‌మెంట్ వద్ద కాపుకాశాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి దృష్టి గోపాల్‌భాస్కర్‌పై పడింది. ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో గోపాల్‌భాస్కర్‌ను అడ్డుకుని తనిఖీ చేయడంతో వేటకొడవలి బయటపడింది. వెంటనే గోపాల్‌భాస్కర్‌ని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి, తమదైన శైలిలో విచారణ చేయడంతో హత్య కుట్ర వెలుగు చూసింది. నిందితుడిని అరెస్ట్ చేసి, వేటకొడవలిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. సకాలంలో స్పందించి హత్య కుట్రను భగ్నం చేసిన సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు.